సాక్షి జనగామ

శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



గుండె పదిలమేనా..?

ఉమ్మడి జిల్లాలో హృద్రోగ మరణాలు పెరుగుతున్నాయి. యువత, చిన్నారులే అధికం. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కథనం. - 8లో



గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ఇద్దరు దంపతులు, ఒక బాలుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం $34^0/24^0$

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి.

న్యూస్‌రీల్

నేడు మంత్రి ఎర్రబెల్లి ‘తండాబాట’

కొడకండ్ల : ‘తండాబాట’ కార్యక్రమంలో భాగంగా మండల పరిధి వివిధ గిరిజన తండాల్లో శుక్రవారం రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ తెలిపారు. ఉదయం 8 గంటలకు గిర్నితండా, 9 గంటలకు మైదంచెరువుతండా, 11 గంటలకు చెరువుముందు తండా, 12 గంటలకు బోడోనికుంటతండా, మధ్యాహ్నం ఒంటిగంటకు రామేశ్వరం, 3 గంటలకు కడగుట్టతండా, 4 గంటలకు హక్యాతండాల్లో మంత్రి పర్యటించి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

అంగడి వేలం ఆదాయం రూ.కోటి 5 లక్షలు



లింగాలఘణపురం: మండల పరిధి నవాబుపేట కోదండరామస్వామి ఆలయ అంగడి హక్కు వేలం ఆదాయం రూ.కోటి 5 లక్షలు వచ్చినట్లు ఈఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. అయితే గత ఏడాది కంటే రూ.18 లక్షల 8వేలు అధికంగా వచ్చిందని చెప్పారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటలో నవాబుపేటకు చెందిన తీగల శ్రీనివాస్ పాల్గొని దక్కించుకున్నాడని, ఈ హక్కు నవంబర్ 22 నుంచి వచ్చే ఏడాది నవంబర్ వరకు ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో గుర్రం బాలరాజు, బూడిది రాజేశ్వర్, బూడిది సదానందం పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షకుడు మోహన్, కొడ్వటూరు ఈఓ వంశీ, జూనియర్ అసిస్టెంట్ మోహన్, సిబ్బంది ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ.. రూ.1,01,116



స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లి బరోడా బ్యాంక్ వద్ద విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో లడ్డూ ప్రసాదం రూ.1,01,116 రికార్డు స్థాయి ధర పలికింది. గ్రామానికి చెందిన గుర్రాల అర్చన, తిరుపతి వేలం పాటలో లడ్డూ దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ బాధ్యులు దిడ్డి సత్యం, రాపర్తి సుధాకర్, వెన్ను సంపత్, వనం సారంగపాణి, మన్స అసిల్, కేశోజు అమరేందర్, గోరంతల రాజు, సుతారి శ్రీరాములు, కుమ్మం సతీష్ పాల్గొన్నారు. డివిజన్ కేంద్రంలో నిమజ్జన కార్యక్రమాలు గురువారం కూడా కొనసాగాయి.

భగత్ సింగ్ త్యాగం మరువలేనిది

జనగామ రూరల్: భగత్ సింగ్ త్యాగం మరువలేనిదని, నేటి తరం యువత ఆయన బాటలో నడవాలని హైకోర్ట్ న్యాయవాది సాధిక్‌అలీ అన్నారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా గురువారం పెంబర్తిలోని బీసీ గురుకుల డిగ్రీ రెసిడెన్సియల్ కళాశాలలో సాధిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అతి చిన్నతనంలోనే దేశంకోసం ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసిన గొప్ప త్యాగశీలి భగత్‌సింగ్ అని.. ఆ మహానుభావుడి జీవిత చరిత్రను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగించాలి

జనగామ రూరల్: విద్యారంగంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ వెంటనే కొనసాగించాలి టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 2010 ఆగస్టుకు ముందు సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత మినహాయించారని, ఆ తర్వాత ప్రమోషన్ పొందిన వారికి టెట్ పేపర్-2 అవసరం ఉందా లేదా అనేది నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొనలేదన్నారు. అయితే హఠాత్తుగా టెట్ ఉత్తీర్ణత కావాలని అనడంతో పదోన్నతిలో సీనియర్ ఉపాధ్యాయుల ఆశలు ఆవిరయ్యాయని అన్నారు. టెట్ ఉత్తీర్ణతకు నిర్దిష్ట గడువు పొడిగించాలని ఈ సందర్భంగా చెప్పారు.

ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ

- తొమ్మిదేళ్లలోనే రాష్ట్రంలో 29 మెడికల్ కాలేజీలు
- ఝూటా మాటల కాంగ్రెస్‌ను నమ్మొద్దు
- అభివృద్ధిని పరిశీలించి బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేయాలి
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- ములుగు, నర్సంపేటలలో మెడికల్ కాలేజీ భవనాలకు శంకుస్థాపన
- మరిపెడ, తొర్రూరులో వంద పడకల ఆస్పత్రులకు భూమి పూజ





మరిపెడలో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి పూజ, నర్సంపేటలో మెడికల్ కాలేజీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి, ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, రవీందర్‌రావు తదితరులు



నర్సంపేట సభలో ప్రజలు, మాట్లాడుతున్న మంత్రి

నర్సంపేట/ములుగు/మరిపెడ : రాష్ట్రంలో టీడీపీ, కాంగ్రెస్ హయాంలో రెండు కళాశాలలు వస్తే.. తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో 29 మెడికల్ కళాశాలలు మంజూరయ్యాయి.. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ వస్తుంది.. దేశంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. ములుగు, వరంగల్ జిల్లా నర్సంపేటలలో మెడికల్ కాలేజీ భవనాలకు శంకుస్థాపన, మహబూబాబాద్ జిల్లా మరిపెడలో మరిపెడ, తొర్రూరులకు సంబంధించి వంద పడకల ఆస్పత్రి భవనాలకు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లతో కలిసి గురువారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల జరిగిన బహిరంగ సభల్లో హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో వలసలు, ధర్నాలు, అరెస్టులతో పరిస్థితి దుర్భరంగా ఉండేదని, ఝూటా మాటల కాంగ్రెస్‌ను ఎవరూ నమ్మొద్దని సూచించారు. అభివృద్ధిని పరిశీలించి బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్ని ట్రిక్కులు ప్లేచేసినా బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయమని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఎల్‌కేజీ ఫీజు కంటే మెడికల్ కళాశాలలో ఫీజు తక్కువగా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

ఏ ఒక్కరూ అనారోగ్యంతో మరణించకూడదనేదే సీఎం లక్ష్యం

ఏ ఒక్కరూ అనారోగ్యంతో మృతి చెందకూడదనదే సీఎం కేసీఆర్ లక్ష్యం అన్నారు. సాధారణ డెలివరీలు చేయడంలో ములుగు జిల్లా భేష్ అని మంత్రి ప్రశంసించారు. రాష్ట్రంలో మొదటి స్థానంలో నారాయణఖేడ్ ఉంటే 87.1శాతంతో రెండో స్థానంలో ములుగు ఉందన్నారు. అందరూ అడిగినట్లుగా ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా చేస్తామని హామీ ఇచ్చారు. అధిక వర్షాలతో ఇళ్లు కూలిపోయిన బాధితులకు మరో రెండు వేల ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు.

గత ప్రస్తుత పాలనను చూడండి : ఎర్రబెల్లి దయాకర్‌రావు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు గతంలో కాంగ్రెస్ పాలనను ప్రజలు విశ్లేషించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాను ఎకరం భూమిని రూ.5వేలకు అమ్మానని.. నేడు అదే భూమిని కొందామని అడిగితే రూ.50 లక్షలు అంటున్నారని తెలిపారు.

సమ్మె విరమించాలి : మంత్రి సత్యవతి

స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పలుమార్లు అంగన్‌వాడీలకు వేతనాలు పెంచారని గుర్తుచేశారు. త్వరలోనే పీఆర్సీ సైతం అమలు కానుందని తెలిపారు. అంగన్‌వాడీలకు అన్ని రకాలుగా సహకరిస్తున్నా సమ్మె చేయడం బాధాకరమని, వెంటనే సమ్మెను విరమించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీలు కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, రెడ్యానాయక్, శంకర్‌నాయక్, హరిప్రియ, సీతక్క, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, తాత మధు, జెడ్పీ చైర్‌పర్సన్లు గండ్ర జ్యోతి, బడే నాగజ్యోతి, మాజీ ఎంపీ సీతారాం నాయక్, కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ప్రావీణ్య, శశాంక తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ఇలా..

ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ పక్కన రూ.180 కోట్లతో నిర్మించనున్న మెడికల్ కళాశాల భవనానికి మంత్రి భూమి పూజ చేయడంతోపాటు పనులను ప్రారంభించారు. రామచంద్రాపురంలో రూ.2.36 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 విద్యుత్ కేవీ సబ్ స్టేషన్‌ను వర్చువల్ పద్ధతిన ప్రారంభించారు. ములుగు ఏరియా ఆస్పత్రిలో రూ.21.27లక్షలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ(ఎస్‌ఎన్‌సీయూ)కేంద్రాన్ని ప్రారంభించారు. గృహలక్ష్మి, దళితబంధు, ఇంచర్ల వాసులకు ఇంటి స్థలాలు, అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక కిట్లు అందజేశారు.

- నర్సంపేట పట్టణంలో రూ.180 కోట్లతో చేపట్టిన వైద్య కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మినీ డెయిరీ పైలట్ ప్రాజెక్టు, గృహలక్ష్మి, దళితబంధు ప్రొసీడింగ్ కాపీలను లబ్ధిదారులకు అందజేశారు.
- మరిపెడ, తొర్రూరు మున్సిపాలిటీ కేంద్రాల్లో మంజూరైన 100 పడకల ఆస్పత్రుల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

కాంగ్రెస్ కాపీ కొడుతోంది



ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్‌ఎస్ సర్కారు అమలు చేస్తున్న పథకాలను కాంగ్రెస్ పార్టీ కాపీ కొడుతోంది.. వాటిని కాస్త అటు ఇటుగా మార్చి ఆరు పథకాల గ్యారంటీలతో ప్రజల ముందుకు వస్తున్నదని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి విమర్శించారు. ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రం శివునిపల్లి, జఫర్‌గఢ్ మండలం కోనాయిచలంలో గురువారం పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గడిచిన తొమ్మిదేళ్లలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని, ఇతర రాష్ట్రాలన్నీ తెలంగాణ వైపు చూస్తున్నాయన్నారు. తెలంగాణ ఉద్యమంలో వందలాది మంది యువకుల ఆత్మబలిదానాలకు కాంగ్రెస్ పార్టీయే కారణమని, ప్రస్తుతం ఆ పార్టీ ఇచ్చే హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. నాడు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఏర్పాటులో జాప్యం చేయడం కారణంగా వందలాది మంది తల్లులు గర్భశోకానికి గురయ్యారని చెప్పారు. ‘నాడు నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసం జరిగిన ఉద్యమంపై స్పందించని తెలంగాణ కాంగ్రెస్ నేతలు.. చివరికి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణకు ఒక్క రూపాయి ఇవ్వనని చెప్పినా నోరు మెదపని చవటలు, దద్దమ్మలు.. అధికారం, పదవుల కోసం అధిష్టానం వద్ద సాష్టాంగ నమస్కారాలు చేశారే తప్ప తెలంగాణ కోసం ఏమీ చేయలేదు’ అని అన్నారు. కాంగ్రెస్ గ్యారంటీ పథకాలు కర్ణాటక రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు చెబుతున్న భట్టి విక్రమార్క క్షేత్రస్థాయిలో చూపించి నిరూపించుకోవాలని సవాల్ చేశారు. నియోజకవర్గ ప్రజలకు కొత్త కాదు, 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా.. ఒక్కసారి ఆశీర్వదించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా’నని కడియం అన్నారు. పని ఇప్పిస్తానని, పదవి ఇస్తానని అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెబుతానని స్పష్టం చేశారు. జిల్లా నాయకులు బెలిదె వెంకన్నగుప్తా, బూర్ల శంకర్‌ముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు గోలి లక్ష్మి, అంగడి సమ్మక్క, సర్పంచ్ సంపత్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కర్ణాకర్‌రావు, ఎంపీటీసీ సభ్యులు బాదవత్ దేవేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నాల బీసీ నినాదం హాస్యాస్పదం



మాట్లాడుతున్న బీసీ సంఘ నాయకులు

జనగామ: జనగామ నియోజకవర్గంలో నాలుగు దశాబ్దాలుగా బీసీలను పట్టించుకోని పొన్నాల లక్ష్మయ్య తన వరకు వచ్చే సరికి బీసీ కార్డు ఎత్తుకోవడం హాస్యాస్పదంగా ఉందని బీసీ సంఘం నాయకులు ధ్వజమెత్తారు. పట్టణంలోని గాయత్రీ గార్డెన్‌లో గురువారం జరిగిన బీసీ సంఘం సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దూడల సిద్ధయ్యగౌడ్, ఎంపీటీసీలు నల్లగోని బాలకిషన్‌గౌడ్, మెరుగు బాలరాజు గౌడ్, నాయకులు ఉడుత రవియాదవ్, వి.యాదగిరిగౌడ్, బనుక శివరాజ్‌యాదవ్ మాట్లాడారు. మంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బీసీలను పట్టించుకోని లక్ష్మయ్య ప్రస్తుతం అయోమయ పరిస్థితుల్లో ఉండడంతో బీసీ నినాదం ఎత్తుకున్నారని విమర్శించారు. గడిచిన రెండు ఎన్నికల్లో ఓటమిపాలైన తర్వాత కనీసం నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదని, చుట్టపు చూపు లెక్క రావడం పోవడం తప్ప బీసీల పరిస్థితి ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేయలేదన్నారు. పొన్నాలకు మినహా కాంగ్రెస్ నుంచి ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని బీసీ సంఘం నాయకుల తరఫున ఏఐసీసీతో పాటు పీసీసీకి మనవి చేసినట్లు పేర్కొన్నారు. లక్ష్మయ్యకు టికెట్ ఇచ్చి మళ్లీ అధికారానికి దూరం చేయవద్దని కోరారు. సమావేశంలో నాయకులు భద్రప్ప, మోటే శ్రీనివాస్, చెవుల పరశురాం యాదవ్, కడారు ప్రవీణ్‌కుమార్, పిట్టల సతీష్, సత్యనారాయణ, పరశురాం, నారాయణ, దూడల నాగరాజ్, బైరగోని రఘు, బత్తుల శ్రీనివాస్, ఆకుల లక్ష్మయ్య, కరుణాకర్, ల్యాగల అంజయ్య, మూల రాములు, పండగ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న ముస్లిం యువకులు

జనగామ: రక్త దానం మరొకరి ప్రాణదానంతో సమానమని పలువురు వక్తలు అన్నారు. మిలాద్ ఉన్ నబీ మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు రక్తదాన శిబిరాలు, ఆస్పత్రుల్లో పండ్ల పంపిణీ చేపట్టారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎండీ.అజహరొద్దీన్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేయగా.. ఏసీపీ దేవేందర్, సీఐ శ్రీనివాస్, డాక్టర్ సుగుణాకర్‌రాజు ఎండీ ఎక్బాల్, ముస్లిం ఖైర్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అలాగే.. టీఎస్ తెలంగాణ మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్(మీసా), హం సాత్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 28వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ సమద్, కోఆప్షన్ సభ్యుడు మసిఉర్ రెహమాన్, బీఆర్‌ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు పల్లవి, హం సాత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మహమ్మద్ యాకుబ్ పాషా, టీఎస్ మీసా బాధ్యులు అంకుశావాలి, మహమ్మద్ జలీల్, మహమ్మద్ హఫీస్, మహమ్మద్ తహసీన్, ఎండీ.ఖాజా ముజ్జహిదుద్దీన్, ఎండీ.నూరొద్దీన్, ఎండీ.ఖలీల్‌హైమద్, ఎండీ.అన్వర్ షరీఫ్, అజహరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్ మీనార్‌లో..

జనగామ రూరల్: పట్టణంలోని ఏక్ మీనార్‌లో మోమిన్ యూత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 25 మంది యువకులు రక్తదానం చేసినట్లు అధ్యక్షుడు జమాల్ షరీష్ తెలిపారు.

కోతులను పట్టి.. బోనులో పెట్టి..



బోనులో బంధించిన కోతులను చూస్తున్న ప్రజాప్రతినిధులు



బందీ అయిన లీడర్ వానరాలు

దేవరుప్పుల: తలుపు తీసినా.. చేతిలో సంచి కనిపించినా.. ముప్పేట దాడిచేస్తూ జనాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్న వానరాలను ఎట్టకేలకు పట్టుకుని బోనులో బంధించారు. దీంతో దేవరుప్పుల బస్‌స్టేజీ కాలనీ వాసులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో కోతుల సమస్య ప్రధానంగా మారింది. దీనిని నివారించడానికి ప్రభుత్వపరంగా తగిన అవకాశాలు లేకపోవడంతో మంత్రి దయాకర్‌రావు దాతలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఏల సోమసుందర్ స్పందించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. దేవరుప్పుల, కామారెడ్డిగూడెం, గొల్లపల్లి, మున్పహాడ్ గ్రామాల్లో సుమారు 500 కోతులను పట్టించేందుకు శ్రీకారం చుట్టారు. రెండు రోజుల్లో సుమారు వంద కోతులను పట్టి బోనుల్లో బంధించారు. ఈ వానర సైన్యానికి సేనాధిపతిలా వ్యవహరించే మూడు నాలుగు లీడర్ కోతులు బందీకావడంతో మిగతావి కిమ్మనకుండా ఉండిపోయాయి. గురువారం మండల కేంద్రంలో బోనుల్లో బందీగా ఉన్న కోతులను చూసిన మిగితా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు తమ ప్రాంతాల్లో కార్యాచరణకు దిగుతున్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

- మంత్రి ఎర్రబెల్లికే ఓటమి భయం
- అధికార పార్టీ కొమ్ము కాస్తున్న పోలీసులు
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి టౌన్: తమ పార్టీ కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులపై మంత్రి ఎర్రబెల్లి దయాకరావు అక్రమ కేసులు పెట్టిస్తున్నాడు.. అయినా భయపడేది లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి దయాకర్‌రావుకు ఓటమి భయం పట్టుకుంటుందని, ప్రతిపక్ష పార్టీల నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయడానికి పోలీసులను ఉపయోగించి అక్రమ కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులపై బీఆర్‌ఎస్ నాయకులు సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న అసత్య ఆరోపణలపై గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. సమావేశంలో అఖిలపక్ష పార్టీల నాయకులు మామిండ్ల రమేష్‌రాజా, డాక్టర్ వి.నరేందర్‌పవార్, శ్రీశైలం, దేవరాయ సాయిలు, చెరిపెల్లి అనంద్, బొట్టు శ్రీధర్, గుమ్మడిరాజు సాంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దింపాలి



జనగామ: జీపు జాతాను ప్రారంభిస్తున్న హైమావతి

జనగామ రూరల్/జఫర్‌గఢ్/పాలకుర్తి: దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై దాడులు పెరుగుతున్నాయి.. అతివల హక్కులు హరిస్తున్న ఆ సర్కారును గద్దె దింపాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బత్తుల హైమావతి డిమాండ్ చేశారు. అక్టోబర్ 5న ఢిల్లీలో ఐద్వా ఆధ్వర్యాన చేపట్టనున్న ర్యాలీ నేపథ్యంలో గురువారం జనగామ పట్టణంలో ప్రారంభమైన జీపు జాతా.. లింగాలఘణపురం, దేవురుప్పుల, పాలకుర్తి మీదుగా జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి(జి), జఫర్‌గఢ్, తిమ్మంపేట, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి ఇప్పగూడెం చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంతోపాటు ఆయా గ్రామాల్లో ఆమె మాట్లాడుతూ.. బీజేపీ పాలిత ప్రాంతాల్లో మహిళలపై హింస పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి ఎండీ.షబానా, అధ్యక్షురాలు అహల్య, రజిత, భవాని, అంజమ్మ, కళ్యాణి, శ్రీలత, చిట్యాల సోమన్న, సత్యం తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు అవకాశం

జనగామ రూరల్: జిల్లా కేంద్రం శామీర్‌పేటలోని మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.హరిప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. బోటనీ, మైక్రోబయలాజీ, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని, జనరల్ అభ్యర్థులకు 55 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు. సెట్, నెట్, పీహెచ్‌డీ చేసి బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని, వచ్చే నెల 3వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవలని సూచించారు. మరిన్ని వివరాలకు 99496 98695, 88975 38351 నంబర్లలో సంప్రదించాలన్నారు.

యాదాద్రీశుడిని దర్శించుకున్న కలెక్టర్



కలెక్టర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న అధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, కుటుంబ సభ్యులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ శివలింగయ్యకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

ఇక.. బోటు షికారు

భద్రకాళి బండ్‌లో అందుబాటులోకి

- కాజీపేట బోడగుట్టలో ట్రెక్కింగ్
- నేడు ప్రారంభించనున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్
- వరంగల్ నగరవాసులకు, పర్యాటకులకు మరింత ఆహ్లాదం



బోటింగ్ చార్జీలు
పెద్దలకు రూ.50
పిల్లలకు రూ.30

హన్మకొండ: పర్యాటక, చారిత్రక, వారసత్వ సంపదకు ప్రఖ్యాతి గాంచిన వరంగల్ మహానగరంలో ఔత్సాహికుల కోసం బోటు షికారు, ట్రెక్కింగ్ అందుబాటులోకి వచ్చాయి. దీంతో నగరం పర్యాటక ప్రాంతంగా మరింతగా విరాజిల్లనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రామప్ప, లక్నవరంలో మాత్రమే జల విహారం ఉండగా ఇప్పుడు నగరంలోనూ విహరించే అవకాశం వచ్చింది. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు (శుక్రవారం) భద్రకాళి బండ్ వద్ద బోటింగ్ యూనిట్, కాజీపేట బోడగుట్టలో ట్రెక్కింగ్ ప్రారంభించేందుకు జిల్లా పర్యాటక శాఖ ఏర్పాట్లు చేసింది.

పర్యాటకానికి మరింత శోభ

వరంగల్‌లో భద్రాకాళి దేవస్థానం, వేయి స్తంభాల దేవస్థానం, ఖిలా వరంగల్ ప్రాంతాలను సందర్శించేందుకు పర్యాటకులు వస్తున్నారు. వీరికి బోటింగ్ చేయాలని ఆసక్తి ఉన్నా ఇక్కడ ఆ సౌకర్యం లేకపోవడం లోటుగానే ఉంది. ట్రెక్కింగ్ చేయాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో వారి కోరికను తీర్చుకోలేక పోతున్నారు. బోటింగ్, ట్రెక్కింగ్ వరంగల్ మహానగరంలో అందుబాటులోకి రావడంతో పర్యాటకుల సంఖ్య మరింత పెరగనుంది. దీంతో ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశముంది.

మూడు చోట్ల బోటింగ్‌కు నిర్ణయం..

వరంగల్ భద్రకాళి, హనుమకొండలోని వడ్డెపల్లి చెరువు, ధర్మసాగర్ రిజర్వాయర్‌లో బోటు షికారును నిర్వహించాలని పర్యాటక శాఖ నిర్ణయించింది. ముందుగా ప్రపంచ పర్యాటక ఉత్సవాల్లో భాగంగా భద్రకాళి చెరువులో బోటు షికారు ప్రారంభం కానున్నది. 30 మంది సామర్థ్యం కలిగిన బోటును తెప్పించారు. భద్రకాళి ట్యాంక్ బండ్ నిర్మాణం, గార్డెనింగ్‌తో భద్రకాళి చెరువు పరిసరాలను సుందరీకరించారు. త్వరలో స్పీడ్ బోట్లు రానున్నట్లు సమాచారం. పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30 చార్జీగా నిర్ణయించారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కాజీపేట సమీప బొడగుట్టలో నిపుణుల సమక్షంలో ట్రెక్కింగ్‌ను, సాయంత్రం 4 గంటలకు భద్రకాళి బండ్ వద్ద బోటింగ్ యూనిట్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, గిరిజన, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌లు ప్రారంభించనున్నారు. ఆయా కార్యక్రమాల్లో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, ఎండీ.మనోహర్‌రావు, ఎంపీ పసునూరి దయాకర్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా పాల్గొంటారు.

క్లుప్తంగా

మైలారంలో బయటపడ్డ విగ్రహాలు



గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో బుధవారం సాయంత్రం దేవుళ్ల విగ్రహాలు బయటపడ్డాయి. మైలారం ప్రభుత్వ పాఠశాల వెనుక ఉన్న గుట్టపై ఉన్న మల్లన్న దేవాలయానికి రోడ్డు మార్గం కోసం తవ్వకాలు జరుపుతుండగా.. రేణుక ఎల్లమ్మ, లక్ష్మీనృసింహ స్వామి విగ్రహాలు బయటపడ్డాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు విగ్రహాలకు పూజలు చేశారు. కాగా.. ఆస్థలాన్ని జిల్లా కేంద్రానికి చెందిన జర్నలిస్టులతో పాటు రేగొండ మండల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం కేటాయించింది. ఆ స్థలాల పట్టాలను గురువారం గణపురం తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ భవేశ్‌మిశ్రా, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పంపిణీ చేశారు. తమ గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని తమ గ్రామాభివృద్ధికే ఉంచాలని, వేరేవారికి అప్పగించవద్దనే లక్ష్యంతో వేరే చోట నుంచి కొందరు విగ్రహాలు తీసుకొచ్చి ఇక్కడ పెట్టి పూజలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి.

కొట్టి.. సారీ చెప్పిన ఎస్సై!

మరిపెడ: మంత్రి హరీశ్‌రావు సభకు వచ్చిన మరిపెడ మండలం బాల్ని ధర్మారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పైకాన్ కుమార్‌ను నర్సింహులపేట మండల ఎస్సై సతీశ్ లాఠీతో కొట్టి.. క్షమాపణ చెప్పినట్లు తెలిసింది. సభా ప్రాంగణం వద్ద తనను లాఠీతో అకారణంగా చితకబాదాడని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ దృష్టికి బాధితుడు తీసుకెళ్లాడు. దీంతో తమ కార్యకర్తను ఎందుకు కొట్టావని ఎస్సైని రెడ్యానాయక్ నిలదీశారు. సభాప్రాంగణం వైపు వస్తుంటే వద్దని వారించినా వినలేదని, దీంతో కొట్టాల్సి వచ్చిందని ఎస్సై చెప్పినట్లు తెలిసింది. ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే కార్యకర్తలనే కొడతావా? అని అనడంతో బాధితుడికి ఎస్సై క్షమాపణ చెప్పినట్లు తెలిసింది.

నేటి నుంచి జోనల్ వర్క్ షాప్

నయీంనగర్: దక్షిణాది రాష్ట్రాల సీసీపీఏ జోనల్ వర్క్‌షాప్ సెప్టెంబర్ 29 నుంచి శుక్రవారం సీసీపీఏ చీఫ్ కమిషనర్ నిధి కరె, కేంద్ర వినియోగదారుల వ్యవహారాల ప్రధాన కార్యదర్శి రోహిత్ కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరుగుతుందని వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, సీసీఏ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ తెలిపారు. ఈసమావేశాలకు తెలంగాణ నుంచి సాంబరాజు చక్రపాణి, మొగిలిచర్ల సుదర్శన్, శంకర్‌లాల్ చౌరాసియా, అనిల్‌కుమార్, ఏ.శివపార్వతి, ఆరు రాష్ట్రాల వినియోగదారుల కమిషనర్లు, వివిధ విభాగాల రాష్ట్ర అధికారులు పాల్గొంటారని తెలిపారు. ధరణి పోర్టల్‌పై సీసీపీఏలో మొదటి విచారణ ప్రారంభం కావడం తెలంగాణలో వినియోగదారుల రక్షణ దృష్ట్యా సంతోషకరమైన పరిణామమని సాంబరాజు చక్రపాణి, మొగిలిచర్ల సుదర్శన్ తెలిపారు.



ఈఫొటోలో కనిపిస్తున్న రైతుది మహబూబాబాద్ మండలం పర్వతగిరి. పేరు పిడుగు జనార్దన్. వయసు 49. ఈనెల 12న గుండెపోటుతో మృతి చెందాడు. పొలం పనులు చేస్తుండగా.. ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన స్థానిక రైతులు చికిత్స కోసం మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు ఆయన మృతి చెందినట్లు తెలిపారు.



ఈచిత్రంలోని చిన్నారిది గీసుకొండ మండలంలోని చంద్రయ్యపల్లి. పేరు యాదండ్ల వర్షిత(10). ఐదో తరగతి చదువుతోంది. స్వల్ప జ్వరంతో బాధపడుతున్న వర్షిత ఈనెల 11న ఉదయం బాగానే ఉంది. కిరాణా షాపుకి వెళ్లి వచ్చి తండ్రితో కలిసి ఆస్పత్రికి వెళ్లేందుకు సిద్ధం అవుతుండగా.. స్పృహ కోల్పోయింది. ఆస్పత్రికి తీసుకెళ్లే దారిలో మృతి చెందింది. గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.



దుగ్గొండి మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన నిగ్గుల శ్రీను(35) ఈనెల 7న బీఆర్‌ఎస్‌లో చేరేందుకు నర్సంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చాడు. కార్యక్రమం అనంతరం మల్లంపల్లికి వెళ్తుండగా.. పట్టణంలోని కమలాపురం క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకోగానే.. నీళ్లు తాగేందుకు వాహనం ఆపి శ్రీను కిందకు దిగాడు. వాటర్ బాటిల్ పట్టుకుని ఒక్కసారిగా కుప్పకూలి కిందపడిపోయాడు. స్థానికులు గమనించి అదే వాహనంలో నర్సంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.



ఈచిత్రంలో కనిపిస్తున్న యువకుడు అరికిల్ల శ్రీధర్(30)ది శాయంపేట మండలం మైలారం గ్రామం. మూడేళ్లుగా ఏఆర్ కానిస్టేబుల్‌గా భూపాలపల్లిలో విధులు నిర్వహిస్తున్నాడు. కొన్నాళ్లుగా ఎస్సై సెలక్షన్స్ కోసం ఈవెంట్స్ సాధన చేస్తున్నాడు. ఈక్రమంలో.. గుండెనొప్పి వచ్చింది. చికిత్స చేయించుకుంటూ సెలక్షన్స్‌కు దూరంగా ఉంటున్నాడు. అనారోగ్యం బారిన పడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ.. ఈనెల 12న మృతి చెందాడు.



వాజేడు మండల కేంద్రానికి చెందిన పన్నెండేళ్ల బాలుడు సూత్రపు హరిచందర్‌కు ఈనెల 16న రాత్రి గుండె పోటు వచ్చింది. వైద్యశాలకు తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందాడు.

పైన పేర్కొన్నవి మచ్చుకు కొన్ని మాత్రమే. కరోనా అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లాలో గుండెపోటు మరణాలు పెరిగాయి. వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటు బారిన పడుతున్నారు. జీవన విధానం, బీపీ, షుగర్, మద్యపానం, ధూమపానం, ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి వంటి కారణాలతో గుండెపోటుకు గురై చనిపోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. - దోర్నకల్

గుండె పదిలమేనా?



పెరుగుతున్న హృద్రోగ మరణాలు

- ఉమ్మడి జిల్లాలో యువత, చిన్నారులే అధికం
- ఒత్తిడి, వ్యాయామం లేక పోవడమే ప్రధాన కారణం
- నేడు వరల్డ్ హార్ట్ డే

కారణాలివే..

ఊబకాయం, మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం, కేలరీలు ఎక్కువగా ఉండే జంక్ ఫుడ్, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిడి, మద్యపానం, ధూమపాన అలవాట్లు, శరీరంలో చెడు కొలెస్ట్రాల్, అతిగా ఆలోచించడం, వంటివి గుండె పోటుకు కారణాలవుతున్నాయి.

ముందుగా కనిపించే లక్షణాలివే..

చాలా మంది ఛాతినొప్పిని గ్యాస్ట్రిక్ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తారు. ఎడమ చెయ్యి నొప్పి, దడ, ఆయాసం, చెమటలు పట్టడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దు. చెడు కొలెస్ట్రాల్, షుగర్, బీపీ వంటివి ఉన్నవారికి అకస్మాత్తుగా రక్తనాళాలు మూసుకుపోతాయి. గుండెకు రక్తం సరఫరా నిలిచి గుండెపోటుకు దారి తీస్తుంది.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలంటే..

భోజనంలో ఉప్పు తగ్గించాలి. చెడు అలవాట్లకు, కాలరీలు ఎక్కువగా ఉండే ఆహారానికి దూరంగా ఉండాలి. మాంసాహారం తగ్గించి, కోడిగుడ్డు, చేప వంటివి తీసుకోవాలి. నూనె పదార్థాలకు దూరంగా ఉండాలి. తాజా ఆహారం, ఆకుకూరలు తీసుకోవాలి. వ్యాయామం తప్పనిసరి. వారానికి ఐదు రోజుల పాటు ప్రతీ రోజు 30 నిమిషాలు చెమటలు వచ్చేలా వాకింగ్ చేయాలి. మోకాళ్ల నొప్పులు ఉన్నవారు యోగా చేస్తే మంచిది.

చికిత్స..

గుండెపోటుకు గురైనవారికి వెంటనే సీపీఆర్ చేయాలి. మూసుకుపోయిన బ్లాక్‌లను క్లియర్ చేసేందుకు 90 నిమిషాల్లోపు ఫెబ్రినో లైటిక్స్, సెస్టోకెనెస్స్ వంటి ఇంజెక్షన్లు వేయాలి. సకాలంలో మెరుగైన చికిత్స అందిస్తే ప్రాణాపాయం తప్పుతుంది.

మారిన జీవన విధానం వల్లే...



మారిన జీవన విధానం వల్లే వృద్ధులతో పాటు యువత గుండెపోటు బారిన పడుతోంది. ప్రతీ సంవత్సరం వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని 'యూజ్ హార్ట్ ఫర్ ఎవ్రీ హార్ట్' పేరుతో గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ.. ప్రతీ రోజూ వ్యాయామం చేయాలి. ఈసీజీ, ఎకో వంటి పరీక్షలు చేయించుకోవాలి. ఖమ్మం, మహబూబాబాద్, డోర్నకల్ వంటి ప్రాంతాల్లో తరచూ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ.. ఈప్రాంత ప్రజలకు గుండె పరీక్షలు చేస్తూ ఆహార నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం.

- డాక్టర్ జితేందర్‌జైన్, సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్, యశోద హాస్పిటల్, హైటెక్ సిటీ

తండ్రిని నరికిన తనయుడు



రాములు మృతదేహం

వాజేడు: కన్న కొడుకే కాలయముడయ్యాడు. తండ్రిని గొడ్డలితో నరికి చంపాడు. వాజేడు మండల పరిధి పేరూరుకు చెందిన బంధం రాములు(50) ప్రతీ రోజు మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఆ తర్వాత భార్య నాగచంద్రను, కొడుకు నరేశ్‌ను దుర్భాషలాడేవాడు. తండ్రిని ఎలాగైనా హతమార్చాలని నరేశ్ పథకం పన్నాడు. బుధవారం రాత్రి సైతం ఎప్పటిలాగే రాములు మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. యథావిధిగా భార్యను, కొడుకును దుర్భాషలాడాడు. ఇది తట్టుకోలేని నరేశ్ ఇంట్లో ఉన్న గొడ్డలితో తండ్రి రాములు తల భాగంలో నరికాడు. దీంతో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. నరేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి



మహేశ్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులోని జ్యోతిబసు నగర్‌కు చెందిన గంగిశెట్టి మహేశ్(24 బుధవారం అర్ధరాత్రి విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. మహేశ్ (24) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. వినాయక నిమజ్జనం సందర్భంగా బుధవారం రాత్రి ట్రాక్టర్ వెంట వెళ్తుండగా.. ఆర్తి గార్డెన్ సమీపంలో ట్రాక్టర్లోని సౌండ్ బాక్సులకు ఉన్న విద్యుత్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. స్థానికులు అతడిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు మహేశ్ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వై.సతీశ్ తెలిపారు.

ముగ్గురు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్



నిందితులను అరెస్టు చూపుతున్న డీసీపీ బారి

వరంగల్ క్రైం: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న దంపతులతో పాటు ఒక బాలుడిని ఇంతేజార్‌గంజ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.4.70 లక్షల విలువైన సుమారు 24 కిలోల గంజాయి, మూడు ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం సరస్‌చప్రా జిల్లాకు చెందిన యోగేంద్రరామ్, వేదావతి దేవి కొద్ది కాలంగా సహజీవనం చేస్తూ.. స్వగ్రామంలో కూలీ పనులు చేసేవారు. సులువుగా డబ్బు సంపాదించాలని బిహార్ రాష్ట్రం ఖట్సే ప్రాంతానికి చెందిన గంజాయి వ్యాపారి అఖిలేశ్‌తో పరిచయం పెంచుకున్నారు. నిందితులు మరో బాలుడితో కలిసి ఒడిశాలోని బరంపుర పరిసరాల్లో తక్కువ ధరకు గంజాయిని కొని రైలులో హైదరాబాద్‌కు చెందిన అరవింద్‌కు అందించేవారు. ఈక్రమంలో బుధవారం 24 కేజీల గంజాయిని బ్యాగుల్లో పెట్టుకుని వరంగల్ రైల్వే స్టేషన్‌లో దిగి హైదరాబాద్‌కు మరో రైలులో వెళ్లేందుకు యత్నించారు. రైల్వేస్టేషన్ ఎదుట అనుమానాస్పదంగా కనిపించడంతో ఇంతేజార్‌గంజ్ పోలీసులు స్థానిక రైల్వే ప్రొటెక్షన్ పోలీసుల సహకారంతో గంజాయి స్మగ్లర్ల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగుల్లో గంజాయి లభించింది. వారిని అరెస్టు చేసి విచారణ నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై కొమురెల్లితో పాటు సిబ్బందిని సెంట్రల్ జోన్ డీసీపీ అభినందించారు.

37 కిలోలు స్వాధీనం

హసన్‌పర్తి: గంజాయి వ్యాపారి నేరెళ్ల సతీశ్ పోలీసులకు చిక్కాడు. బుధవారం రాత్రి అంబాల రోడ్డు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. సతీశ్‌ను అరెస్ట్ చేశారు. అతడి నుంచి 37 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం విలేకరుల సమావేశంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపీ గురువారం వివరాలు వెల్లడించారు. ఈనెల 7న బరిస్సా నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న క్రమంలో ఎల్లాపురం వద్ద ఓ ముఠా పోలీసులకు చిక్కింది. ఈముఠాలో ప్రధాన నిందితుడు నేరెళ్ల సతీశ్ పోలీసుల నుంచి తప్పించుకున్నాడు. అప్పటి నుంచి సతీశ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈక్రమంలో బుధవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా.. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు పంచనామా నిర్వహించి నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక యంత్రాలపై రైతులకు అవగాహన



డ్రోన్ ద్వారా మందు పిచికారీపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

హసన్‌పర్తి: 'గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమం'లో భాగంగా ఎస్సార్ యూనివర్సిటీ కళాశాల విద్యార్థులు హసన్‌పర్తి మండలం గంటూరపల్లిలో రైతులకు వివిధ ఆధునిక యంత్రాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన రైతు వర్థమాధవరెడ్డి పొలంలో డ్రోన్ ద్వారా మందు పిచికారీపై అవగాహన కల్పించారు. ఈటెక్నాలజీ ద్వారా సమయాన్ని ఆదా చేయడంతోపాటు కూలీలు లేకుండా పిచికారీ చేయవచ్చన్నారు. డ్రోన్‌ను ఉపయోగించడం ద్వారా ఖర్చు తగ్గించుకోవడమే కాకుండా ఐదు నిమిషాల్లో ఎకరాకు పిచికారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో గంటూరుపల్లి సర్పంచ్ పెద్ది తిరుమతమ్మ మల్లారెడ్డి మాట్లాడుతూ.. అధునాతన యంత్రాల వాడకాన్ని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు హారిక, వి.హేమారెడ్డి, పూజిత, క్రిస్టియానాజోన్స్, సునీత, స్వాతి పాల్గొన్నారు.

పోరాడండి.. మీవెంట మేముంటాం

- ఎంపీ డాక్టర్ వి.శివదాసన్
- భూ పోరాటాల్ని ఉధృతం చేస్తాం
- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్



వాజేడు: మాట్లాడుతున్న వెంకట్

వాజేడు: 'ఇంటి స్థలం దక్కే వరకు పోరాడండి. మీ వెం మేముంటాం' అని ఎంపీ డాక్టర్ వి.శివదాసన్ అన్నారు. గత 18 రోజులుగా వాజేడు మండలం మండపాక సమీపంలో ఉన్న 11వ సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాల కోసం పేదలు పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. కాగా.. గురువారం ఎంపీ డాక్టర్ శివదాసన్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్ పోరాటం చేస్తున్న పేదలను కలిశారు. భూ సమస్యలపై సదస్సు నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కూలి రేట్లు, భూ సమస్యలపై శివదాసన్ మాట్లాడుతూ.. పేదలకు ఇంటి స్థలం ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుముఖంగా లేకపోవడాన్ని ప్రజలు గమనించాలన్నారు. 18 రోజులుగా పోరాటం చేస్తున్న పేదల వైపు ఎర్ర జెండా పార్టీ.. తప్ప వేరే ఏ పార్టీ రాకపోవడం ఆయా పార్టీల వైఖరిని తెలియజేస్తోందన్నారు. వెంకట్ మాట్లాడుతూ.. తెలంగాణలో భూ పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్రంలో పేదలకు పంచేందుకు ప్రభుత్వం వద్ద 7.30 లక్షల ఎకరాల భూమి ఉందన్నారు. వెంటనే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్యానంవాసు అధ్యక్షతన జరిగిన ఈసదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య, వెంకట రాములు, రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, పొన్నం వెంకటేశ్వర్లు, కనకయ్య, రైతు సంఘం నాయకులు సూడి కృష్ణారెడ్డి, కొప్పుల రఘుపతి, కుమ్మరి శ్రీను, ఎండీ దావూద్, దామోదర్, కృష్ణబాబు, దేవయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

స్వామినాథన్ మృతి.. రైతులకు తీరని లోటు

వరంగల్: హరిత విప్లవ పితామహుడు, రైతు బాంధవుడుగా పేరొందిన డాక్టర్ ఎంఎస్.స్వామినాథన్ అనారోగ్యంతో మృతి చెందడం దేశ రైతాంగానికి తీరని లోటని ఏఐకేఎఫ్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బీరం రాములు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. దేశంలో రైతుల ఆత్మహత్యలను ప్రభుత్వాలు నివారించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తగా పట్టా పొంది అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలను కనిపెట్టేందుకు ఏళ్ల తరబడి పరిశోధనలు చేసి హైబ్రీడ్ వంగడాలతో 1960వ దశకంలో భారత వ్యవసాయ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించిన గొప్ప శాస్త్రవేత్త స్వామినాథన్ అని తెలిపారు.

రెగ్యులరైజ్.. కొందరికేనా?

ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్ల ఆవేదన

- క్రమబద్ధీకరణకు రాష్ట్రవ్యాప్తంగా 411 మంది నిరీక్షణ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 55 మంది లెక్చరర్లు
- మంత్రులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం శూన్యం



హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితకు సమస్యను విన్నవిస్తున్న ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకులు(ఫైల్)

విద్యారణ్యపురి : తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారిలో కొందరు రెగ్యులరైజ్ కోసం నిరీక్షిస్తున్నారు. కళాశాలల్లోని జనరల్ విభాగంలో పనిచేసే కాంట్రాక్టు లెక్చరర్లే ఎక్కువ మంది రెగ్యులరైజ్ అయిన విషయం తెలిసిందే. అయితే ఒకేషనల్ కోర్సులు బోధించే వారిలో కేవలం 184 మందినే రెగ్యులరైజ్ చేసి పోస్టులు లేవని మరికొందరిని వదిలేశారు. అయితే ఉన్న పోస్టులను కన్వర్షన్ చేస్తే రెగ్యులరైజ్ చేయొచ్చునని సంబంధిత కాంట్రాక్టు లెక్చరర్లు పేర్కొంటున్నారు. ఈవిషయాన్ని సంబంధిత ఉన్నతాధికారులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా తమ సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 26 ఫిబ్రవరి 2016న జీఓ 16ను జారీ చేసింది. దీనికి అనుగుణంగా రెగ్యులరైజ్ ప్రక్రియను అసెంబ్లీ ఆమోదించింది. కానీ ఈఏడాది మే 30న తెలంగాణ సచివాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రభుత్వం 5,500 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ జీఓ 38ని జారీ చేసింది.

411 ఒకేషనల్ లెక్చరర్ల నిరీక్షణ

23 ఏళ్ల నుంచి ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో విద్యాబుద్ధులు నేర్పిస్తూ అన్ని అర్హతలు కలిగిన తమను పోస్టులు లేవనే కారణంతో రెగ్యులరైజ్ మొదటి లిస్టులో కలపకుండా వదిలివేశారని 411 మంది అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి రాష్ట్ర విభజన జరిగిన సందర్భంలో కమలనాథన్ కమిటీ.. తెలంగాణ రాష్ట్రానికి ఒకేషనల్ విభాగంలో 842 జూనియర్ అధ్యాపక పోస్టులు కేటాయించిందని తెలుస్తోంది. ఈ పోస్టులను అవసరానికి అనుగుణంగా కన్వర్షన్ చేసే వెసులుబాటు ఉన్నప్పటికీ అధికారులు వాటిని చేయలేక, పోస్టులు లేవని సమాధానం చెబుతున్నారని ఆయా అధ్యాపకులు పేర్కొంటున్నారు. మొదటి లిస్టు ప్రకటించిన సందర్భంలో రెగ్యులరైజ్ కాని మిగతా కాంట్రాక్టు అధ్యాపకులు.. సంబంధిత ఉన్నతాధికారులను కలిసి విన్నవించగా 15 రోజుల్లో రెండో లిస్టు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఉస్మానియా, కాకతీయ తదితర యూనివర్సిటీల్లో రెగ్యులర్‌గా చదివి అధ్యాపకులుగా కాంట్రాక్టుపై విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ తమను రెగ్యులర్ చేయకపోవడంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కళాశాలల్లో ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లు 55 మంది ఉన్నారు. హనుమకొండ జిల్లాలో 19 మంది, వరంగల్ జిల్లాలో నలుగురు, జనగామలో 15 మంది, మహబూబాబాద్‌లో నలుగురు, ములుగులో ఒకరు, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలో 12 మంది వరకు ఉన్నట్లు సమాచారం.

మంత్రి, ఎమ్మెల్సీలను కలిసిన కాంట్రాక్టు అధ్యాపకులు

ఒకేషనల్ జూనియర్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ ఆధ్వర్యంలో 200 మందికిపైగా కాంట్రాక్టు లెక్చరర్లు శనివారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ పల్లారాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవితను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని జేఏసీ నాయకులు రవిశంకర్, అనిల్, ప్రవీణ్, మధు, కల్యాణి, సుమలత, ఉమాదేవి, తదితరులు కోరారు.

రెగ్యులరైజేషన్‌కు చొరవ చూపాలి..



రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లకు కేవలం 184 మందినే రెగ్యులరైజ్ చేశారు. ఇంకా 411 మంది ఉన్నారు. వారందరిని కూడా రెగ్యులరైజ్ చేయడానికి ప్రభుత్వం చొరవ చూపాలి.

- ఆర్.ప్రవీణ్, ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్, హనుమకొండ

13 ఏళ్లుగా పనిచేస్తున్నా..



జనగామ ప్రభుత్వ కో–ఎడ్యుకేషన్ కళాశాలలో 13 ఏళ్లుగా ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. రాష్ట్రంలో కొందరు రెగ్యులరైజేషన్ అయ్యారు. ఇంటర్ జనరల్ విభాగంలో అర్హులైనవారంతా రెగ్యులరైజేషన్ అయ్యారు. ఒకేషనల్ కోర్సులకు వచ్చేసరికి రెగ్యులర్ పోస్టులు లేవని సంబంధిత అధికారులు సాకులు చెబుతున్నారు.

- పి.ప్రియదర్శిని, ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్, జనగామ

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి



రోహిత్ మృతదేహం

ధర్మసాగర్: మండలంలోని పీచర గ్రామ శివారు వెంకట శ్రీ స్టోన్ క్రషర్ ఆవరణలో క్వారీ గుంతలో పడి బీహార్ రాష్ట్రానికి చెందిన రోహిత్ కుమార్(20) బుధవారం మృతి చెందాడు. రోహిత్‌తో పాటు మరి కొంతమంది యువకులు ఇక్కడ కార్మికులుగా పని చేస్తున్నారు. కాగా.. స్టోన్ క్రషర్ ఆవరణలో ఉన్న క్వారీలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి తీసుకెళ్లారు. క్వారీలో పని చేస్తున్న కార్మికులు వినాయక విగ్రహాన్ని క్వారీలో వేసేందుకు వెళ్లి బయటికు వచ్చారు. ఈక్రమంలో క్వారీలోకి వెళ్లిన రోహిత్ బయటకు రాకపోవడంతో మిగతా కార్మికులు వెతికినా.. ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం క్వారీలో వెతకగా.. అతడి మృతదేహం లభ్యమైంది. క్వారీ గుంత లోతు ఎక్కువగా ఉండడంతో రోహిత్‌కు ఈత రాక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెంది ఉంటాడని తోటి కార్మికులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

యువకుడి మృతిపై అనుమానం!

రోహిత్‌కుమార్ మృతిపై గ్రామ సర్పంచ్ మేక రవీందర్ అనుమానం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యువకుడి మృతి విషయం తెలుసుకున్న తాను గ్రామస్తులు, వార్డు సభ్యులతో కలిసి క్రషర్ వద్దకు వెళ్తే లోపలికి అనుమతించలేదన్నారు. దీంతో యువకుడి మృతిపై అనుమానం వస్తోందని ఆరోపించారు. గుట్టు చప్పుడు కాకుండా మృతదేహాన్ని క్వారీ యజమానులు తరలించారని సర్పంచ్ పేర్కొన్నారు. యువకుడిది హత్యా, లేక ప్రమాదవశాత్తు జరిగిందా? అనేది తేలాల్సి ఉందన్నారు. లోపలికి అనుమతిస్తే క్వారీలోని లోపాలు బయటకు పొక్కుతాయనే తమను అనుమతించలేదని ఆయన ఆరోపించారు. పోలీసులు లోతైన దర్యాప్తు చేయాలని సర్పంచ్ కోరుతున్నారు.